అమ్మమ్మ జ్ఞాపకాలు చీర మడతల్లో దాచుకున్న మొగలిపువ్వు పరిమళాలాల్లా గుబాళిస్తూనే ఉంటాయి. అమ్మమ్మ పేరు శాంతమ్మ. ఎప్పుడూ శాంతంగా, చెరగని చిరునవ్వుతో సార్థక నామధేయురాలిలా ఉండేది.

ఎవరికే సాయం కావల్సినా కాదనేదికాదు. ఆ పల్లెటూర్లో పట్టాలేని డాక్టరామె. ఎవరమ్మాయి పురుడు పొయ్యాలన్నా ఎరుకల సూరమ్మ ఉన్నా పక్కన అమ్మమ్మ నిలబడాల్సిందే. ఆవిడ అడుగు పెడితే పండంటి పాపాయినెత్తుకుని తల్లీ బిడ్డా ఆనందంగా ఉంటారని నమ్ముతారు మా ఊరి జనం. అర్ధరాత్రైనా వచ్చి తలుపు తడితే చాలు అమ్మమ్మ బయలుదేరేది. ఆవిడ మంత్రం వేస్తే బెణుకు నొప్పులు మటుమాయం.

అమ్మమ్మ ఎప్పుడైనా ఊరువెడతానంటే అందరికీ బెంగే. వారంలో వచ్చేస్తానంటే కదలనిచ్చేవారు అందరూ. ఊళ్ళో మోతుబరి రైతుల్లో అమ్మమ్మ ఒకతె. మా మేనమామలు ఉద్యోగస్తులు కావడంతో ఎప్పుడో చుట్టం చూపుగా వచ్చి వెళ్ళేవారు.

అమ్మమ్మ పాలేర్లను పెట్టి స్వంత వ్యవసాయం చేసేది. కూలీలందరికీ మా ఇంట్లోంచే టిఫిన్, భోజనం అన్నీ వెళ్ళేవి. అమ్మమ్మ దగ్గరుండి చేయించేది అన్నీ. 'ఆ అమ్మ వంట అమృతం' అంటూ లొట్టలేసుకుని తినేవాళ్ళు పాలేర్లు.

ఆరోజు ప్రక్క ఊరి మునసబు సత్తిరాజు గారమ్మాయి పెళ్లి.

"వదినా నువ్వు వచ్చి మా అమ్మాయినీ, అల్లుణ్ణీ నాలుగక్షింతలు వేసి ఆశీర్వదిస్తే చాలు వాళ్ళు నూరేళ్ళు ఆనందంగా ఉంటారు తప్పకుండా రావాలి సుమీ'' అని పిలిచి వెళ్లాడాయన.

తెల్లవారుఝామునే లేచి తయారవ్వడం మొదలుపెట్టాం. అమ్మమ్మ నన్ను, చెల్లినీ తీసుకెళతానని ముందే చెప్పింది. పట్టుపరికిణీలు కట్టాం. అమ్మమ్మ జడ కుప్పెలు పెట్టి జడవేసి పైన నాగరం, జడలో చామంతి పువ్వూ పెట్టింది. చెరో గొలుసూ వేసింది. చేతులకు గాజులు వేసింది. అన్నీ అమ్మమ్మ మాకోసం చేయించింది.

ఈలోగా ఇంటిముందు సైకిల్ ఆగిన చప్పుడు. బయటకొచ్చి చూస్తే సత్తిరాజు గారు హడావిడిగా వస్తున్నారు. ఆయనను అరుగుమీద కూర్చోబెట్టి పెద్దగ్లాసెడు పాలు తెచ్చి ఇచ్చి వారు స్థిమితపడ్డాక "ఏమిటి విషయం సత్తిరాజూ!''' అని నెమ్మదిగా అడిగింది అమ్మమ్మ.

వంటవాడు రాలేదని, పెళ్లివారితో మాట పడాల్సి వస్తుందేమోనని, తనకు కాళ్ళూ చేతులు ఆడడం లేదని ఈ గండం నుంచి గట్టెక్కించాల్సిందే అమ్మమ్మని బ్రతిమిలాడుతున్నాడాయన.

"ముందు పద. నేను ఐదునిముషాల్లో వస్తాను'' అంటూ హడావిడిపడుతున్న అమ్మమ్మతో "అమ్మమ్మా మావయ్యలు పెద్ద ఉద్యోగస్తులు. నువ్విప్పుడు మునసబుగారింట్లో వంట చేస్తావా? ఎంత పరువు తక్కువ'' అన్నాను కోపంగా.

"అమ్మా...అతడిప్పుడు పెద్ద సమస్యతో బాధపడుతున్నాడు. నేను వెళ్ళి నిలబడితే నలుగురూ కూడతారు. శుభకార్యం గట్టెక్కుతుంది. ఈమాత్రానికే నా మర్యాదేం తగ్గదు'' అంటూ అక్కడికి బయలుదేరింది మాతో పాటూ.



# పరోపకారం

-సి.రత్నమాంబ

"అమ్మయ్య. శాంతమ్మగారొచ్చేశారు...'' అంటూ ఆడామగా సంతోషంగా ఎదురొచ్చారు. అమ్మమ్మ దిగుతూనే గాడిపొయ్యి దగ్గరకి దారితీసింది. అందరూ ఆవిడననుసరించారు.

"ముందు పెళ్లికొడుకు వారికి టిఫిన్లు పంపుదాం'' అంటూ చకచకా తలో పనీ పురమాయించేసింది అమ్మమ్మ.

అంతవరకూ కాఫీ, టిఫిన్లు రాలేదని అలిగిన మగపెళ్లివారు అమ్మమ్మ చేయించిన వంటకాల ఘుమఘుమలతో చల్లబడ్డారు.

మధ్యాహ్నానికి పనసపొట్టుకూర, దోసకాయ పప్పు తయారుచేయించింది. కూరలన్నీ దగ్గరుండి తయారుచేయించేసింది.

పులిహోర పూర్ణాలు, అప్పడాలు, వడియాలు రెడీ అయ్యాక గాడిపొయ్యి మీద మూడుగుండిగలు పెట్టి అన్నం వండించింది. స్నాతకం తంతు పూర్తయ్యి పెళ్లి పీటల మీద కూర్చున్నారు వధూవరులు. అందరూ చక్కగా తయారై వచ్చి పెళ్లి కార్యక్రమం చూశారు. రాధ పెళ్ళి నిర్విఘ్నంగా ఐపోయింది. అందరూ వధూవరులను ఆశీర్వదించారు. తలంబ్రాలు మిగిలిన తతంగం అయ్యాక అమ్మమ్మ మనసబుగారి భార్య దమయంతిని పిలిచి కుంకుమభరిణ ఇచ్చి పెళ్లివారిని భోజనాలకు పిలవమంది. ఆవిడా, భర్తా వెళ్లి అందర్నీ పిలుచుకువచ్చారు.

అంతా భోజనాలు చేశారు. "వంటలు చాలా బాగున్నాయి. ఏ ఊరి బ్రాహ్మలు చేశారు?'' అని అడిగారు వియ్యాలవారు. నోటికొచ్చిన పేరు చెప్పి తప్పించుకున్నారు సత్తిరాజుగారు.

ఆడపెళ్లివాళ్ళు, ఊళ్ళోవాళ్ల అంతా తృప్తిగా భోజనాలు చేశారు. అప్పగింతలై అమ్మాయి అత్తవారింటికెళ్లిపోయింది. ఊళ్ళోవాళ్లకు, బంధువులకు కృతజ్ఞతలు చెప్పారు మునసబుగారు. "మాకు కాదు చెప్పాల్సింది శాంతమ్మగారికి'' అంటూ ఏకకంఠంతో చెప్పారు వాళ్ళు.

అమ్మమ్మను పట్టుబట్టలతో సత్కరించారు మునసబు దంపతులు. ఆమె పరోపకార బుద్ధిని అంతా కొనియాడారు.

అమ్మమ్మ ఇప్పుడు లేదు కానీ మనస్సుపొరల్లో ఆమె జ్ఞాపకాల మధురిమలు నిత్యనూతనాలు.

★